సాక్షి సిద్దిపేట

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



ఊడల మర్రి.. చూసొద్దాం రండి

ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామంలో రెండెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఊడల మర్రి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వివరాలు 8లో ▸



నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

వర్గల్ నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

వివరాలు 8లో ▸



యువత నైపుణ్యాలు పెంచుకోవాలి

ఏబీవీపీ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో యువజన వారోత్సవ ముగింపు సభ నిర్వహించారు.

వివరాలు 9లో ▸

సొంతిల్లు 'గ్యారంటీ'



సర్కార్ తీపి కబురుతో కొత్త ఆశలు

- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- ఉచిత విద్యుత్‌కు, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం
- వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు భరోసా
- గురుకులాలకు సొంత భవనాలు
- ప్రగతిబాట పట్టనున్న పట్టణాలు
- రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

సాక్షి, సిద్దిపేట: ఇల్లు లేని వారికి కాంగ్రెస్ సర్కారు తీపి కబురు చెప్పింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. అందులో భాగంగా శనివారం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో గ్యారంటీలకు పెద్దపీట వేసింది. పదేళ్లుగా సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలనే వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. నూతన ప్రభుత్వం సొంతింటి కలను నెరవేరుస్తామన్న భరోసా ఇచ్చింది. అలాగే ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు సాయం అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీనిపై కొందరు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ మరి కొందరు నిధుల కేటాయింపు సరిగా లేదని అంటున్నారు.

ఉచిత విద్యుత్తు..

ఎన్నికల హామీలలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారికి ఉచిత విద్యుత్‌ను అందించనుంది. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు బడ్జెట్‌లో రూ.2,418 కోట్లను కేటాయించారు. జిల్లాలో ఉచిత విద్యుత్ కోసం 2,67,734 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఇంటింటికీ తిరిగి విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

రూ.500 గ్యాస్ సిలిండర్

త్వరలో రూ.500లకు గ్యాస్ సిలెండర్‌ను అందజేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఇటీవల ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ సిలిండర్ కోసం 2,83,767 మంది దరఖాస్తు చేశారు. వాటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. దీంతో ప్రభుత్వం అర్హులకు రూ.500లకే గ్యాస్ సిలెండర్‌ను త్వరలోనే అందించనుంది.

అభివృద్ధి చెందనున్న పట్టణాలు

రాష్ట్ర బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు రూ.11, 692 కోట్లను కేటాయించారు. దీంతో జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీల లో115 వార్డులు మరింత అభివృద్ధి చెందనున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఇందు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7,740 కోట్ల నిధులను కేటాయించారు. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. అందులో 2,36,014 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో మంజూరు చేసిన ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేయనుంది. జిల్లాకు సుమారుగా 15వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. దీంతో కొందరికి సొంతింటి కల సాకారం కానుంది.

రైతుకు భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చేందుకు ఎకరాకు రూ.15వేల చొప్పున అందించనుంది. జిల్లా వ్యాప్తంగా 6 లక్షల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. 2లక్షలకు పైగా రైతులకు భరోసా అందించనుంది. అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కూడా సాయం అందించనుంది. వ్యవసాయ కూలీలు 1,44,818 మంది, కౌలు రైతులు 8,033 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హులకు రైతు భరోసా ద్వారా ప్రభుత్వం సాయం అందించనుంది.

గురుకులాలకు..

జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు 39 ఉండగా అద్దె భవనాల్లో 21 కొనసాగుతుండగా సొంత భవనాల్లో 18 ఉన్నాయి. వాటి నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. సొంత భవనాలకు స్థలాలు కేటాయించి నిర్మిస్తే విద్యార్థుల ఇబ్బందులు తప్పనున్నాయి. అలాగే ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 26 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయి.

గ్యారంటీలపైనే ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలే అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. తాగు, సాగు నీటి కోసం నిధులు తక్కువగానే కేటాయించారు. యువతకు ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రజలకు వైద్యం మరింత అందుబాటులో తీసుకు వచ్చి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

– వల్లకోటి దేవేందర్, సీనియర్ హోమియోపతి వైద్యుడు

బడ్జెట్ అద్భుతం



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖలకు నిధులు కేటాయించారు. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ సేవల పెంపు అమలు అవుతుండగా త్వరలోనే మిగతా హామీలు అమలు కానున్నాయి.

– నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

విద్యారంగాన్ని విస్మరించిన సర్కార్



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. బడ్జెట్‌లో 8 శాతం మాత్రమే విద్యకు నిధులు కేటాయించింది. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసినట్టే కనిపిస్తోంది. ప్రతి మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలను ప్రారంభించడం శుభపరిణామమే.. అదేవిధంగా ఇప్పుడున్న పాఠశాలల్లో కూడా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కనీసం 15 శాతం పైగా కేటాయింపులు ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుంది.

– ఊడెం రఘువర్దన్ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

కృష్ణా, గోదావరి జలాలపై అఖిలపక్షం

సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి డిమాండ్

హుస్నాబాద్: కృష్ణా, గోదావరి జలాలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసే పనిచేస్తామని, అసెంబ్లీ సమావేశాల తర్వాత పొత్తులపై చర్చించే అవకాశం ఉందన్నారు. ఐదు లోక్‌సభ స్థానాలు కావాలని కోరుతున్నామని, అందులో ఒకటైనా ఇవ్వాలన్నారు. ఇండియా కూటమి నుంచి కొన్ని పార్టీలు వెళ్లిపోయినా ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు కూటమికి కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించాలని ఆయన కోరారు. పదేళ్లలో నరేంద్ర మోదీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రూ.50 లక్షల కోట్లు అప్పుచేస్తే, మోదీ రూ.లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తదితరులు ఉన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

సిద్దిపేటజోన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక జరిగింది. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా క్రీడా సమాఖ్య అధ్యక్షుడు సాయిరాం ప్రారంభించారు. అండర్ 16 బాలబాలికల విభాగంలో రెండు జట్లను ఎంపిక చేశారు. పోటీలకు 187మంది బాలురు, 57 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికైన జిల్లా జట్లకు కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో ఆదివారం నుంచి 15 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ఆ జట్లు 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా మల్లారెడ్డి గూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొంటాయి.

న్యూస్‌రీల్

మంత్రి 'పొన్నం'కు వర్గల్ ఉత్సవ ఆహ్వానపత్రిక



మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి కొలువైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో 14న జరగనున్న వసంత పంచమి మహోత్సవం ఆహ్వాన పత్రికను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. శనివారం వారు ఆయనను కలిసి ఉత్సవానికి హాజరుకావాలని కోరారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈపాస్ మిషన్‌లో అప్‌డేట్ చేయాలి



స్టాక్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న శివప్రసాద్

నంగునూరు(సిద్దిపేట): ఈపాస్ మిషన్‌లో ఎరువుల అమ్మకాలు, నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ దుకాణదారులకు సూచించారు. శనివారం రాజగోపాల్‌పేట, పాలమాకుల గ్రామాల్లో ఏఓ గీతతో కలసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి స్టాక్, అమ్మకపు వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని, వ్యవసాయ అధికారులు పొలాలను పరిశీలించి సలహాలు సూచనలు అందజేస్తున్నారన్నారు.

ద్రోహం చేసేవారు పార్టీకి అవసరం లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: ద్రోహం చేసేవారు పార్టీకి అవసరం లేదని, నిరభ్యంతరంగా బయటికి వెళ్లవచ్చని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం అక్కన్నపేట మండల స్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, ఆటుపొట్లను దాటి మళ్ళీ పుంజుకుంటామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగ, మండల అధ్యక్షుడు సాంబరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు లింగాల సాయన్న, కాసర్ల అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



ములుగు అటవీ కళాశాల

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో రెండో విడత నర్సరీ ఏర్పాటుకు నిర్వహించనున్న సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రొఫెసర్ ఎం.మమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీబీటీ–టీఎస్‌సీఓఎస్‌టీ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగులకు నర్సరీల పెంపకం, వర్మీకంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకంపై ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ప్రతి నెలా రూ.10వేలు స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకోసం 80743 50866, 84668 71929 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మొక్కలతోనే స్వచ్ఛమైన వాతావరణం

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్




దంప్ యార్డును పరిశీలిస్తున్న గరీమా అగర్వాల్

చిన్నకోడూరు(సిద్దిపేట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. డంప్ యార్డు, శానిటేషన్, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. పంచాయతీ రికార్డులు, వాటర్ ట్యాంకులు, మిషన్ భగీరథ నీటిని పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఓ దేవకి దేవి, జెడ్పీ సీఈఓ రమేశ్, డీఎల్పీఓ మల్లికార్జున్, ప్రత్యేక అధికారి దివ్యజ్యోతి, మిషన్ భగీరథ ఈఈ గిరిధర్, డీఈ కృష్ణ, ఏఈ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఇబ్రహీంపూర్ భేష్

పలు రాష్ట్రాల అధికారుల కితాబు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి శనివారం మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న పలు రాష్ట్రాల ఆర్థికశాఖ అధికారులు సందర్శించారు. గ్రామంలోని ఉపాధిహామీ పనులు, స్వచ్ఛ భారత్ మిషన్, ఇంకుడు గుంతలు, గొర్లషెడ్లు, కూరగాయల సాగు, నర్సరీ, డంప్‌యార్డు, వర్మీ కంపోస్టు, శ్మశానవాటిక, రూరల్ హెల్త్ మిషన్ సంచార వైద్యశాల వంటి వాటిని సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామస్తుల భాగస్వామ్యం గురించి ఎంపీడీఓ వారికి వివరించారు. గ్రామంలో అభివృద్ధి బాగుందని ఆ అధికారులు కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి, శిక్షణ అధికారులు 30 మంది పాల్గొన్నారు.



హెల్త్ మిషన్‌ను సందర్శిస్తున్న అధికారులు

● జన జాతర



భక్తులతో కిటకిటలాడిన పుల్లూరు బండ



పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి జాతరలో భాగంగా శనివారం బండంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు బండపై భక్తులకు కనువిందు చేసింది. ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, అర్చకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, చక్రధర్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, పలువురు నాయకులు స్వామిని దర్శించుకున్నారు.

– సిద్దిపేటరూరల్

పల్లెకు పాకిన ఫామ్‌హౌస్ కల్చర్



వ్యవసాయక్షేత్రంలో నిర్మించుకున్న ఇల్లు

పట్టణ వాసుల ఆసక్తి

- వీకెండ్స్ విడిదిగా వినియోగం
- గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల కొనుగోలు
- వేగంగా విస్తరిస్తున్న కల్చర్



ఫామ్‌హౌస్ గేటు

సండే స్పెషల్

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరాలు పట్టణాల్లో నిత్యం ఉరుకులు, పరుగుల జీవితాన్ని గడుపుతున్న పట్టణ వాసులు పల్లె వాతావరణాన్ని కోరుకుంటున్నారు. వీకెండ్స్, సెలవు దినాల్లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు కొందరు గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకు సమీప గ్రామాల్లో వ్యవసాయ భూములు కొనుగోలుచేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకొంటున్నారు. పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకుని కుటుంబ సమేతంగా ఫామ్ హౌస్‌లో సేద తీరుతున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లాలో ఫామ్‌హౌస్‌ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. హైదారాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలో పలు మండలాల్లో ఫామ్‌హౌస్‌ల నిర్మాణాలు పెరిగాయి. స్థోమతను బట్టి 10 గుంటల నుంచి 10ఎకరాల వరకు వరకు భూ ములను కొనుగోలు చేసి అనుకున్నట్లుగా నిర్మాణాలు చేసుకుంటున్నారు.

ఒకప్పుడు ఫామ్‌హౌస్ కల్చర్ ధనికులకు మాత్రమే పరిమితం కాగా ఇప్పుడు కొంత ఆర్థికంగా స్థిరపడిన వారుకూడా వాటిపై ఆసక్తి చూపుతున్నారు. పట్టణాల్లో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యంతో పలు వైరస్‌ల బారిన పడకుండా ఉండాలన్న ఆలోచనతో మధ్య తరగతి వాళ్లు, వ్యాపారస్తులు కూడా వ్యవసాయ క్షేత్రాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సెలవు దినాలు, పండుగ రోజుల్లో ఫామ్‌హౌస్‌లలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నారు. జిల్లాలో వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్‌హౌస్‌ల నిర్మాణాలు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. వ్యవసాయ క్షేత్రాల్లో కొంత స్థలాన్ని ఫామ్‌హౌస్‌ల నిర్మాణానికి కేటాయిస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిన వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, వైద్యు లు, ప్రభుత్వ ఉద్యోగులు ఫాంహౌస్‌ల నిర్మాణా లు చేపడుతున్నారు. ఉదయం, సాయంత్రం ఫామ్‌హౌస్‌ల్లో యోగా వాకింగ్‌చేస్తూ తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకునే పనిలో పడుతున్నారు. అలాగే ఫంక్షన్లను ప్రకృతి ఒడిలో చేసుకుంటున్నారు.



అందంగా తీర్చిదిద్దిన రహదారి, మొక్కలు

పెరుగుతున్న ఫామ్‌హౌస్‌లు

హైదరాబాద్ పట్టణానికి గజ్వేల్ నియోజకవర్గం దగ్గరగా ఉండడం వల్ల ములుగు, వర్గల్, మర్కుక్, జగదేవ్‌పూర్, కొండపాక, గజ్వేల్ మండలాల్లో ఫామ్‌హౌస్ కల్చర్ విస్తరిస్తోంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు రాజీవ్ రహదారి ఉండడం, ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పల్లె ప్రగతితో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం, నీటి సౌకర్యంతో ఫామ్‌హౌస్ కల్చర్ పెరగడానికి దోహపడుతున్నాయి. 10 గుంటల నుంచి 10 ఎకరాలకు పైగా స్థలాలు కొనుగోలు చేసి వారి ఆర్థిక స్థోమతను తగ్గట్టుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. విశాలమైన ఇంటి నిర్మాణం చుట్టూ ప్రహరీ, ఆవరణలో వివిధ రకాల పూల మొక్కలతోపాటు పళ్ల మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ బావుల వద్ద ఇంటి నిర్మాణ అనుమతులను నిబంధనలు సడలించడం వల్ల ఈ కల్చర్ పెరిగేందుకు దోహపడుతోంది. జిల్లాలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, కొమురెల్లి మల్లన్న, కొండపోచమ్మ, నాచారం, వర్గల్ సరస్వతి ఆలయాలు దగ్గరగా ఉండడంతో రోజు రోజుకు ఫామ్‌హౌస్ కల్చర్ పెరుగుతోంది.

క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ యోగాసాన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలు నిర్వహిస్తున్నామని ప్రముఖ యోగా గురువు తోట సతీశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పతంజలియోగా పీఠం జాతీయ ప్రతినిధి స్వామి యజ్ఞ దేవ్, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు

సిద్దిపేటజోన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట కు చెందిన క్రీడాకారుడు జితేశ్ రెండు అంశాల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. అండర్ -8 విభాగంలో 300 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్ అంశాల్లో ప్రతిభ కనబర్చాడు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి వెంకట్ స్వామి జితేశ్‌ను అభినందించారు.

సెలవు ప్రకటించాలి

సంగారెడ్డి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న దేశవ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. జయంతి సందర్భంగా తండాల్లో భవానీ మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల వద్ద పెద్ద ఎత్తున మహాబోగ్ బండార్ పూజలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్, పూల్‌సింగ్ నాయక్, రామావత్ కిషన్, సురేందర్, దినేష్ నాయక్, ఆకాష్, కిరణ్ పాల్గొన్నారు.







తాటి వనం.. జీవన గమ్యం

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రత్యేక తాటి వనాల ప్రాంతాలు ఉన్నాయి.. సిద్దిపేట మండలంలోని బూర్గుపల్లి, మిట్టపల్లి, నంగునూర్ మండలంలో అంక్షపూర్, పాలమాకుల, అక్కేనపల్లి, చిన్నకోడూరు మండలం రామునిపట్ల, కోహెడ మండలంలోని కూరెల్ల గ్రామంలో, హుస్నాబాద్ మండలం పందిళ్ళ, మద్దూర్ మండలంలో బైరాన్‌పల్లి, చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామాల్లో తాటి వనాల్లో కల్లుగీస్తూ వేలాది మంది గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈ తాటి వనాలు పచ్చన పొలాల్లో మధ్యలో ఉండడం కల్లు ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.

ఆలోచన అదుర్స్..

మనం నిత్యం నారు మడిలోనే వరి పండించడం చూస్తుంటాం.. కానీ ఈ చిత్రాన్ని చూసే మీరు వాటెన్ ఐడియా రైతన్న అనకుండా ఉండలేరు. కాల్వపై నిర్మించిన కల్వర్టుపై ఓ రైతు వరి పండిస్తున్న దృశ్యం కోహెడ మండల పరిధిలోని కూరెల్ల తాటివనంలో సాక్షి కెమెరా కంటపడింది. దీన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్,సిద్దిపేట

నవోదయ పరీక్ష ప్రశాంతం



వర్గల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,548 మంది హాజరు
- కేంద్రాలను సందర్శించిన అధికారులు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్‌లో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 1,548 మంది హాజరయ్యారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1,052 మంది అభ్యర్థులకు గాను 773 (73.47శాతం)మంది హాజరైనట్లు నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1109కి గాను 775 (69.88 శాతం) మంది హాజరైనట్లు వివరించారు. సిద్దిపేట డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ బన్సీలాల్, ఏసీపీ రమేశ్ ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారని, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

పల్లె ప్రకృతి.. చేతల్లో వికృతి

- ఎండిపోతున్న మొక్కలు
- అస్తవ్యస్తంగా నిర్వహణ
- ఊరికి దూరంగా ఏర్పాటు
- మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



రామవరం ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు 'ఎండిపోతున్నాయి'. పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. ఏదో ఊరు చివరన హడావుడిగా ఏర్పాటు చేసి వదిలేయడంతో.. అప్పుడే మైదాన ప్రాంతాలుగా మారిపోయాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పల్లె వనాలపై పట్టింపే లేకుండా పోతోంది.

అక్కన్నపేట మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా చౌటపల్లి, ముంపు గుడాటిపల్లి గ్రామాల్లో తప్ప అన్నీ గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. చౌటపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో నిర్మించలేదు.

అందని ఆహ్లాదం

మండలంలోని రామవరం, గుబ్బడి గ్రామాల్లో ఊరికి దూరంగా పల్లె ప్రకృతి వనాలను నిర్మించారు. రామవరం గ్రామానికి దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో సుమారుగా రూ.6 లక్షల వ్యయంతో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఊరికి దూరంగా ఉండడంతో నీళ్లు పెట్టే వారు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ వనంలో చాలా మొక్కలు ఎండుముఖం పట్టాయి. అలాగే పక్కనే డంపింగ్ యార్డు రోడ్డు పక్కనే వ్యర్థాలను బహిరంగంగా కాల్చుతున్నారు. దీంతో నిత్యం దట్టమైన పొగ వ్యాపిస్తూ ఉంటుంది. ఉదయం, సాయంత్రం ప్రజలు సేద తీరడానికి గ్రామాలకు ఆనుకొని పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే, ఇక్కడ మాత్రం మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు.

మందుబాబులకు అడ్డాగా..

గ్రామాలకు దూరంగా, గుట్టల్లో ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. సాయంత్రం అయితే మందుబాబులు మద్యం సేవించి సీసాలు, గ్లాసులు, తినుబండరాళ్లు పడేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో 'పల్లె ప్రకృతి వనాలను' ప్రజలు సేద తీరేలా అందుబాటులోకి తీసుకోరావాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. వనంలో మొక్కలు ఎండిపోతే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటాం. వారం రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను సందర్శిస్తున్నాం. పిచ్చి మొక్కలను తొలగిస్తాం.

– కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ అక్కన్నపేట

అభ్యంతరాలుంటే చట్టపరంగా వెళ్లాలి

- అనుమతితోనే ఇథనాల్ ఫ్యాక్టరీ
- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్
- నిర్మిస్తే ఆత్మహత్య చేసుకుంటామని పలువురు ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల శివారులో నిర్మించనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో అభ్యంతరాలుంటే చట్టపరంగా వెళ్లాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో శనివారం ఇథనాల్ కంపెనీపై గుగ్గిల్ల, తిమ్మాయపల్లె గ్రామాల ప్రజలకు పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కంపెనీ ఏర్పాటుకు యాజమాన్యం అనుమతులతో వెళ్తున్నందున పనులను అడ్డుకోవడం తగదన్నారు. కానీ ఫ్యాక్టరీ నిర్మిస్తే తమకు చావే శరణ్యమని రెండు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ స్థలంలో క్రిమిసంహారక మందు డబ్బాలు, పెట్రోల్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఇక్కడ నిర్మిస్తే వాతావరణం, భూమి, నీళ్లు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్ఐ నరేందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. మీకు అభ్యంతరాలుంటే చట్టపరంగా వెళ్లాలని సూచించడంతో ఆందోళన విరమించారు

ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయిలో గుర్తింపు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



నరేందర్‌కు అవార్డును అందిస్తున్న ప్రముఖులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరేందర్‌కు జాతీయస్థాయిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ సంస్థ, అలురి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టరేట్లు అందజేత, అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యుత్తమ సామాజిక సేవా, విద్యా, వైద్య రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు, డాక్టరేట్లు అందజేశారు. ఈ మేరకు విద్యా రంగంలో ప్రతిభ కనబర్చిన నరేందర్‌కు జాతీయస్థాయిలో అవార్డు వరించింది. కార్యక్రమంలో సంస్థ అధినేత విల్సన్, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. కాల్వలో శవమై

- 18 రోజులకు మృతదేహం లభ్యం
- జాతరకు వచ్చి తప్పిపోయి వ్యక్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్)/ చేర్యాల(సిద్దిపేట): అదృశ్యమైన వృద్ధుడు కాల్వలో అస్థిపంజరమై కనిపించిన ఘటన శనివారం జగదేవ్‌పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం..హైదరాబాద్‌లోని మల్లాపూర్‌కు చెందిన దుబ్బాక సుభాష్(58) కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 23న కొండపోచమ్మ జాతరకు వచ్చారు. మతిస్థిమితం సరిగా లేక నల్ల పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న కెనాల్ వైపు వెళ్లాడు. సుభాష్ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో 18 రోజుల తర్వాత శనివారం తపాస్‌పల్లి కెనాల్ కాల్వలో అస్థిపంజరంతో ఓ వ్యక్తి నీళ్లపై తేలాడుతూ అటుగా వెళ్తున్న నాగపూరి గ్రామవాసికి కనిపించాడు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం అందించారు. జగదేవ్‌పూర్, కొమురెల్లి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. శవాన్ని బయటకు తీసి షార్ట్‌ను బట్టి దుబ్బాక సుభాష్‌గా గుర్తించారు.



దుబ్బాక సుభాష్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

వట్‌పల్లి(అందోల్): ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. శనివారం మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో కరుణం సురేశ్‌రావు దంపతుల చేతుల మీదుగా పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం

నర్సాపూర్: షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధమైన ఘటన నర్సాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్‌కు చెందిన బ్రహ్మం శనివారం ఉదయం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తన రిపేరింగ్ షాపును తెరిచాడు. కొంత సేపటికి బయట పని ఉండడంతో షెట్టర్ కిందికి వేసి వెళ్లాడు. అనంతరం దుకాణంలో నుంచి పొగలు రావడంతో పక్కన ఉన్న దుకాణదారులు గమనించి యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారువచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే దుకాణంలోని రిపేరు కోసం వచ్చిన రెండు ఫ్రిజ్‌లు, 14 ఫోన్లు, కంప్యూటర్, ఇతర ఫర్నీచర్ కాలి బూడిద అయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు బ్రహ్మం తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గజ్వేల్‌రూరల్: వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు వివరాల ప్రకారం.. పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోని ఓ ఇంట్లో హసీనా (రజియా) భర్త ఇస్మాయిల్ ఇతర మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి ములుగు మండలం తునికి గ్రామానికి చెందిన ముట్ట గణేశ్‌తోపాటు ఓ మహిళను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.500 నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విటుడు, విటురాలితో పాటు వ్యభిచార గృహ నిర్వాహకురాలిని గజ్వేల్ పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విరేచనాలతో తండ్రీకొడుకులు మృతి



అమలాల్



అన్ను మోహాజీ

హత్నూర (సంగారెడ్డి): అధిక విరేచనాలతో తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటన హత్నూర మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అమలాల్ మోహాజీ, భార్య నర్మదా మోహాజీ, ఇద్దరు కుమారులు జై మోహాజీ, అన్ను మోహాజీలు హత్నూర మండలం కొత్తగూడెం పంచాయతీ పరిధిలో మాన్ సింగ్ ఇటుక బట్టీల వద్ద రెండు నెలల నుంచి పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి తండ్రి అమలాల్ మోహాజీ(35), చిన్న కొడుకు అన్ను మోహాజీ(2)కి అధికంగా విరేచనాలు అయ్యాయి. ఎంతకూ తగ్గకపోవడంతో అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో యజమాని మాన్ సింగ్‌కి చెప్పగా తన కారులో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. భార్య నర్మదా మోహాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. గవ్వలపల్లి గ్రామానికి చెందిన రెడ్డి భిక్షపతి (35) ఏడాది కిందట రూ.15 లక్షల వరకు అప్పు చేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశాడు. కానీ వ్యాపారం నడవక అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం అదే వాటర్ ప్లాంట్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం అయినప్పటికీ భోజనానికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ప్లాంట్‌కి వెళ్లి చూడగా ఉరి వేసుకొని కనిపించాడు. భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

ఊడల మర్రి.. చూసొద్దాం రండి

- ఆకట్టుకుంటున్న అచ్చాయిపల్లి వటవృక్షం
- రెండెకరాల్లో విస్తరణ
- పర్యాటక కేంద్రంగా చేయాలని గ్రామస్తుల వినతి

ములుగు(గజ్వేల్): ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామంలో రెండెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఊడల మర్రి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లి రాజీవ్ రహదారికి 3 కిలోమీటర్లు, ములుగు మండలం వంటిమామిడి రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో విశిష్ట వృక్షంగా వర్ధిల్లుతున్న ఊడలమర్రి చూపరులను ఆకట్టుకుంటుంది.

ములుగు మండలంలోని మారుమూల గ్రామమైన అచ్చాయిపల్లి పేరు వింటే మొదట గుర్తుకొచ్చేది ఊడలమర్రే. సుమారు 20 ఏళ్ల కిందట ఆవిర్భవించినట్లు చెబుతున్న ఈ మర్రి మొదలు ఎక్కడుందో ఎవరికీ తెలియదు. అబ్బురపరుస్తున్న ఈ మర్రి వద్ద జానీ, లాహిరి లాహిరిలో.., సూపర్ హీరో వంటి సినిమాలు చిత్రీకరించారు. గ్రామంలో ఉన్న ఊడలమర్రి విశిష్టత పెరుగుతున్న క్రమంలో ప్రభుత్వం దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తగు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

ఆలయ ప్రత్యేకత..

ఊడలమర్రి కింద ఉన్న పోచమ్మదేవాలయం ప్రత్యేకతను చాటుకుంటుంది. ఎప్పుడూ భక్తులతో కిటకిటలాడుతూ ఉండే ఈ ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల వారే కాకుండా హైదరాబాద్ పట్టణం నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మరికొందరు భక్తులైతే వారు కొత్తగా ఏ పని మొదలు పెట్టినా ముందుగా ఆ ఆలయానికి వచ్చి పోచమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తారు.



మర్రి వృక్షం ఊడలు



అచ్చాయిపల్లిలోని ఊడలమర్రి

పర్యాటక కేంద్రంగా చేయాలి



గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఊడల మర్రిని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా చేయాలి. ఈ విషయమై గతంలో పలుమార్లు సమావేశాలకు హాజరైన అధికారులకు కూడా విన్నవించాం. ఊడలమర్రి కింద ఉన్న దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేసి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలి.

– శ్రీనివాస్‌యాదవ్, గ్రామస్తుడు

ప్రత్యేక ఆకర్షణ..



గ్రామంలో ఉన్న ఊడలమర్రి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న విషయం వాస్తవమే. ఊడల మర్రిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. మర్రి చెట్టుకింద గల పోచమ్మ ఆలయానికి కూడా వసతుల కల్పనకు కృషి చేసి భక్తులకు సౌకర్యాలు మెరుగుపడేలా చేయాలి.

– రామచంద్రం, మాజీ సర్పంచ్, అచ్చాయిపల్లి